క్లుప్తంగా

హామీలను అమలు చేయడంలో బాబు విఫలం

• వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప



మడకశిర: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలయ్యారు. ఆ కారణంగా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు' అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసమే తిరుమల లడ్డూపై అబద్ధాలు ఆడారన్నారు. చంద్రబాబు, పవన్ రాష్ట్రంలో నీచమైన రాజకీయం చేస్తున్నారని చెప్పారు. వైఎస్ జగన్ తిరుమల పర్యటనను డిక్లరేషన్ పేరుతో అడ్డుకోవడం సమంజసమా అని ప్రశ్నించారు. చంద్రబాబు గతంలో దళితులను ఎన్నో సార్లు అవమానించారని తెలిపారు. వైఎస్ జగన్ రాజకీయంగా దళితులకు పెద్దపీట వేశారని తెలిపారు. బాబు, పవన్‌కల్యాణ్ ఇకనైనా నీతిని జాయతీగా రాజకీయాలు చేయాలని హితవు పలికారు. వైఎస్ జగన్‌ను కించపరిచే విధంగా మాట్లాడితే సహించమని హెచ్చరించారు.

మద్యం షాపులు బంద్



మడకశిరలోని మద్యం షాపును మూసివేసిన దృశ్యం

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం మద్యం షాపులు బంద్ అయ్యాయి. ఐదు మండలాల పరిధిలో ఆరు మద్యం షాపులున్నాయి. ఈ షాపులన్నీ బంద్ కావడంతో మద్యం ప్రియులు ఇబ్బందులు పడ్డారు. సీఎం చంద్రబాబు మద్యం షాపులను ప్రైవేటు పరం చేస్తుండటంతో తామంతా రోడ్డున పడాల్సి వస్తోందని మద్యం షాపుల్లో ఐదేళ్లుగా పనిచేస్తున్న సూపర్ వైజర్లు, సేల్స్‌మెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి నిరసనగా మద్యం షాపులను మూసివేశారు. వెంటనే తమకు న్యాయం చేయాలని కోరారు.

జూదరుల అరెస్ట్

మడకశిర: మండల పరిధిలోని బేగార్లపల్లి సమీపంలోని క్యగాలగుట్ట పరిసర ప్రాంతాల్లో మంగళవారం జూద కేంద్రంపై దాడి నిర్వహించినట్లు రూరల్ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.6030 స్వాధీనం చేసుకున్నామన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఆబాద్‌పేట వాసులు

హిందూపురం: పదిరోజులు గడుస్తున్నా కొళాయిలకు నీళ్లు ఇవ్వకపోతే ఎలా జీవించాలంటూ స్థానిక ఆబాద్‌పేటకు చెందిన మహిళలు ధ్వజమెత్తారు. ఇందులో భాగంగానే మంగళవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్ ముందు వారు నిరసన తెలిపారు. తమ ప్రాంతానికి నీళ్లు వదిలే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదన్నారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి వెంటనే నీళ్లను వదులుతామని చెప్పడంతో వారు నిరసన విరమించారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

రొద్దం: మండల పరిధిలోని పెద్దిపల్లి గ్రామ రోడ్డు నిర్మాణానికి మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత భూమి పూజ చేశారు. అనంతరం శిలాఫలకం ఆవిష్కరించారు. పావగడ–పెనుకొండ ప్రధాన రహదారి తురకలాపట్నం క్రాస్ నుంచి గ్రామానికి రూ. 50 లక్షలు ఉపాధి నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి తెలియజేశారు. ఆ తర్వాత తురకలాపట్నంలో పింఛన్ల పంపిణీ చేశారు.

ఎక్సైజ్ సీఐగా లక్ష్మీ దుర్గయ్య



లక్ష్మీ దుర్గయ్య

హిందూపురం అర్బన్: హిందూపురం ఎక్సైజ్ సీఐగా లక్ష్మీ దుర్గయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కర్ణాటక నుంచి మద్యం తరలిరాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో అక్రమ మద్యం అమ్మకాలు చేస్తుంటే తమ దృష్టికి తీసుకు రావాలని ప్రజలను కోరారు.

మడకశిర ఎక్సైజ్ సీఐగా ప్రసాద్

మడకశిర: మడకశిర ఎక్సైజ్ సీఐగా టీ ప్రసాద్‌ను నియమిస్తూ సంబంధిత ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇంత వరకూ ఇక్కడ సీఐగా పనిచేసిన ధీరజ్‌రెడ్డిని మైదుకూరుకు బదిలీ అయ్యారు.

నవరాత్రి శోభ

• రేపటి నుంచి శరన్నవరాత్రులు • అమ్మవారి ఆలయాల ముస్తాబు

శరన్నవరాత్రులు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో ఉన్న అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు చేసేందుకు ఆలయ కమిటీల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

ఇష్టకార్యం సిద్ధిస్తుంది



కొల్హాపురి మహాలక్ష్మీదేవికి ప్రతి మంగళ, శుక్రవారం విశేష పూజలు నిర్వహిస్తాము. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక అలంకరణలతో పూజిస్తాము. అమ్మవారిని దర్శించుకొంటే భక్తులకు ఇష్టకార్యం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. తొమ్మిది రోజుల పాటు జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాము.

– వసంతచారి, ప్రధాన అర్చకుడు, రత్నగిరి

రొళ్ల: రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో దసర శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. చౌళరాజుల వంశానికి చెందిన రత్నగిరి సంస్థాన మహారాజు అయిన క్రిష్టప్పరాజు సురుపుర్ చెందిన రాణిగౌడమ్మను వివాహం ఆడినట్లు చరిత్ర చెబుతోంది. అప్పట్లో రాణిగౌడమ్మను రత్నగిరి సంస్థానానికి గుర్రపు మార్గాన తీసుకొస్తున్నప్పుడు ఓరకమైన శబ్దం రావడంతో ప్రశ్నించారు. నేను కొల్హాపురి మహాలక్ష్మీదేవిని మీ సంస్థానంలో కొలువుదీరడం కోసం మీ వెంట అరిసిన కుంకుమ రూపంలో వస్తున్నానని చెప్పిందట. రాణిగౌడమ్మ సంస్థానానికి వచ్చిన మరుసటి రోజు అమ్మవారు అరిసిన కుంకుమ (పసుపు కుంకుమ) రూపంలో కొలువుదీరి దాని పైన నాగుల పుట్ట పెరిగింది. దీంతో క్రిష్టప్పరాజు రాణిగౌడమ్మ సారథ్యంలో గారబొమ్మతో కూడిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి శిలా విగ్రహంతో పాటు పాలబావిని ఒకే రోజు నిర్మించి ప్రతిష్టించారు. నాటి నుంచి నేటి వరకూ మహిమాన్విత ఆలయంగా ప్రసిద్ధి చెందింది. మన రాష్ట్రంతో పాటు కర్ణాటక నుంచి కూడా ఎక్కువ మంది భక్తులు ఇక్కడికి తరలివస్తుంటారు.

భక్తుల కొంగు బంగారం చౌడేశ్వరీదేవి



చౌడేశ్వరీదేవి

హిందూపురం: హిందూపురం సమీపంలోని కొటిపి గ్రామదేవతగా వెలసిన చౌడేశ్వరీదేవి భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందారు. చోళుల కాలంలో స్వయంభూగా అమ్మవారు వెలిశారు. అమ్మవారికి కొత్తచీరలో ఓడి బియ్యం అందించిస్తే తల్లి చల్లని దీవెనలు ఖాయమని భక్తులు చెబుతున్నారు. ఒడిబియ్యం అందించిన చీరలు చెరువు వద్ద రాసులుగా గుట్టలుగా పేరుకుపోయినా ఒక్కరు కూడా చీరలను ముట్టరు. ఎంతటి విలువైన చీర అయినా ఇక్కడి నుంచి ఎవరూ తీసుకోరు. తీసుకెళ్తే అమ్మవారి ఆగ్రహానికి గురికాకతప్పదని భక్తుల నమ్మకం. అమ్మవారికి ఏ జంతువును బలి ఇచ్చినా కిందపడిన రక్తం కూడా వెంటనే ఎండిపోతుందని అంటున్నారు. దసరా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తి చేశారు.

ఒడిబియ్యంతో అమ్మవారి అనుగ్రహం



చోళరాజుల కాలంలో చౌడేశ్వరీదేవి స్వయంభుగా వెలిశారని పూర్వీకుల ద్వారా తెలిసింది. అత్యంత మహిమాన్వితమైన అమ్మవారిగా భక్తులు కొలుస్తారు. ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చిపూజలు చేసి ఇక్కడే వంటకాలు చేసి అమ్మవారికి సమర్పించి భుజించి వెళ్తుంటారు. ఒడిబియ్యం సమర్పిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని అందరి నమ్మకం.

– చౌడిశెట్టి, ఆలయ పూజారి, కొటిపి

ధ్వజస్తంభంలో వెలసిన దుర్గమ్మ



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

లేపాక్షి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో ధ్వజస్తంభంలో వెలసిన దుర్గమ్మ భక్తుల కోర్కెలను తీర్చే అమ్మవారిగా వెలుగొందుతున్నారు. విజయనగర రాజుల కాలంలో కొత్తగా ఆలయం నిర్మించేటప్పుడు నలుమూలల పూజలు చేస్తారు. అయితే ఈ ఆలయంలో శిల్పులు కలశస్థాపనకు బదులుగా నాలుగు మూలల విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈశాన్యంలో వాస్తు పురుషుడు, ఆగ్నేయంలో క్షేత్రపాలకుడు, నైరుతీలో గణపతి, వాయువ్యంలో దుర్గాదేవిని విగ్రహాలను ఏర్పాటు చేసి ఆలయం పనులు మొదలు పెట్టారని చరిత్రద్వారా తెలుస్తోంది. దుర్గాదేవి విగ్రహము వాయువ్య మూలలో ఒక స్తంభంలో చెక్కబడింది. శిల్పులు విగ్రహాన్ని మలిచే సమయంలో దుర్గాదేవి భక్తులపై ఆవాహనమై తాను ఈ స్తంభంలో కొలువై ఉన్నానని, ఇక్కడే తనకు పూజలు జరిపించాలని కోరడంతో అప్పటి నుంచి పూజలు చేస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరిస్తారు. ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యానిర్వహణాధికారి నరసింహమూర్తి తెలిపారు.



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

పెనుకొండకు రక్షగా కాళికాదేవి



పెనుకొండ కోర్టు ఆవరణలో వెలసిన కాళికాదేవి

పెనుకొండ రూరల్: పెనుకొండ పట్టణంలోని కోర్టు ఆవరణంలో 1500 శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయల పాలనలో కాళికామాత అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. పెనుకొండ కోటకు నాలుగు వైపులా ఆంజనేయస్వామి దేవాలయాలతో పాటు అమ్మవారి దేవాలయాలను కూడా గ్రామానికి రక్షగా ప్రతిష్టించారు. అప్పట్లో ఊరి పొలిమేర వద్ద నిర్మించిన కాళికామాత ఆలయం క్రమంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడి అమ్మవారు కోరిన కోర్కెలు నెరవేరుస్తారని భక్తుల విశ్వాసం. నవరాత్రి ఉత్సవాలను ఇక్కడ అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

భక్తిశ్రద్ధలతో నవరాత్రి వేడుకలు



విశ్వ బ్రాహ్మణ ఆచార్య వంశీకులకు కాళికాదేవి ఆడబిడ్డ. 1500 శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయలు ఈ కాళికామాత ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. విశ్వ బ్రాహ్మణ ఆచార్య వంశీకులే దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి మంగళ, శుక్రవారాలు ప్రత్యేక పూజలు చేస్తున్నాము. రానున్న నవరాత్రులలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. అమ్మవారి దర్శనం కోసం ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివస్తుంటారు.

– రమేష్ , ఆలయ అర్చకులు, పెనుకొండ



చోళమాంబదేవి

అమరాపురం: మండలంలో ఉన్న చోళమాంబదేవి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయాన్ని చోళుల కాలంలో నిర్మించారు. చోళుల వంశానికి చెందిన చోళమాంబదేవి తమ రాజ్య పరిధిలోని అన్ని గ్రామాల్లో చెరువులు తవ్వించడంతో ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకునేవారని అర్చకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే తమ ఆస్థాన కవి అమరసింహుడి సహకారంతో అమరాపురంలో ఆమె స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని ఇక్కడ కూడా చెరువు కట్ట నిర్మించారు. ఇక్కడే ఆమె కన్నుమూయడంతో చోళమాంబదేవి విగ్రహాన్ని గ్రామస్తులు ప్రతిష్టించి పూజలు చేస్తున్నారు. ఇందులో బాగంగా గ్రామంలో అత్యంత సుందరమైన ఆలయాన్ని నిర్మించారు. అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ప్రసిద్ధి చెందారని ఆలయ అర్చకులు శ్రీనివాస్ తెలిపారు. వివాహం కాని వారు, రోగగ్రస్తులు, మహిళలు ఎంతో మందికి అపన్నహస్తం ఇచ్చి అమ్మవారు కాపాడుతున్నారని భక్తుల నమ్మకం. 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

భక్తులకు ఆపన్న హస్తం

బాధిత కుటుంబానికి పరామర్శ




దశరథ్‌నాయక్ దంపతుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

గోరంట్ల: మండల పరిధిలోని దిగువ గంగంపల్లిలో ఆదివారం పిడుగుపడి దశరథ్‌నాయక్, దేవీబాయి దంపతులు చనిపోయిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. అధైర్యపడొద్దు.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట జెడ్పీటీసీ సభ్యుడు జయరాంనాయక్ , పార్టీ మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పరిగి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ మండల కేంద్రంలో మంగళవారం పర్యటించారు. పరిగిలో వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ డీలర్ మూర్తి మాతృమూర్తితో పాటు మైనార్టీ నాయకుడు జిక్రియాఖాన్ తల్లి అనారోగ్య కారణాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉషశ్రీచరణ్ పరిగికి వచ్చి మృతుల భౌతికకాయాల వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. ఆమె వెంట మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక



రొద్దం: చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన పెద్దమంతూరు విద్యార్థులు

మడకశిర: పట్టణంలో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలో అత్యంత ప్రతిభ కనపరిచి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు, కదిరేపల్లి సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ పరీక్షకు ఎంపికై య్యారు. వారిని ఎంఈఓ భాస్కర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా జేవీవీ కార్యదర్శి శ్రీనివాసులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో పెద్దమంతూరు విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం శివరాం తెలిపారు. జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

హిందూపురం టౌన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షల్లో మండలంలోని సీ.చెర్లోపల్లికి చెందిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అశోక్‌నాయక్ తెలిపారు. ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థినులు దీక్షిత, హేమలత, వినమ్రలు చెకుముకి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. అనంతరం వారికి ఎంఈఓ గంగప్ప చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు.

చిలమత్తూరు: మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో టేకులోడు క్రాస్‌లోని మహాత్మాజ్యోతిభా పూలే గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పొట్టి శ్రీరాములు జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన మండలస్థాయి చెకుముకి టెస్ట్‌లో సాహిత్య, స్పందన, చందన మండల స్థాయి టాపర్స్‌గా నిలిచారన్నారు. జిల్లా స్థాయి పోటీలో వారు పాల్గొంటారని ఆమె తెలిపారు.

పెనుకొండ: పట్టణంలోని సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ పరీక్ష సజావుగా జరిగింది. పరీక్షల్లో గ్లోబల్‌జెన్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు హరి, సుధాకర్, లింగారెడ్డి, ఇలియాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా నాగార్జున



హిందూపురం: విజయవాడలో జరిగిన ఆంధ్రా చెస్ అసోసియేషన్ కొత్త ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికల్లో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా జిల్లా అసోసియేషన్ కార్యదర్శిగా ఉన్న నాగార్జున ఎన్నికయ్యారు. తనపై నమ్మకంతో జాయింట్ సెక్రటరీగా ఎన్నుకున్నందుకు సభ్యులకు నాగార్జున ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి మృతి



గోపీనాథ్

అమరాపురం: మండల పరిధిలోని బసవనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి గోపీనాథ్ (56) అనారోగ్యంతో మంగళవారం అనంతపురంలోని తన స్వగృహంలో మృతి చెందినట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ఈఓఆర్డీ నాగముని, సహచర కార్యదర్శులు ఈరన్న, నరేష్‌బాబు, జీవరత్నం తదితరులు అనంతపురంకు వెళ్లి గోపీనాథ్ వద్ద నివాళులర్పించారు.

బదిలీ అధికారులకు సన్మానం



అధికారులను సన్మానిస్తున్న అనంతరాజు

రొళ్ల: ఎంపీడీఓ ఆజాద్, ఈఓఆర్డీ క్రిష్టప్ప, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, వివిధ పంచాయతీల కార్యదర్శులకు వీడ్కోల సన్మాన సభను మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు మాట్లాడుతూ అంకితభావంతో పని చేస్తే ఉద్యోగులకు గౌరవం లభిస్తుందన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కియా పోలీసుల వివరాల మేరకు.. గుట్టూరుకు చెందిన బోయ పోతన్న (65) ఐదురోజుల కిత్రం పెనుకొండ హైవేపై రోడ్డు దాటుతుండగా వాహనం ఢీ కొట్టడంతో గాయపడ్డాడు. కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ పీరా తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కృష్ణవేణి




చరణ్

మడకశిరరూరల్: అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో మడకశిర మండలం గౌడనహళ్లి, కల్లుమర్రి ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం నరేంద్ర, పీఈటీ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. గౌడనహళ్లి పాఠశాలలో 7వ తరగతి చదువున్న కృష్ణవేణి బ్యాడ్మింటన్‌లో, కల్లుమర్రి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువున్న చరణ్ అండర్-17 వాలీబాల్ పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు.

తరగతులు నిర్వహిస్తే చర్యలు

హిందూపురం టౌన్: దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించే ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల విద్యాశాఖాధికారి గంగప్పకు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



మడకశిర మండలం గోవిందాపురంలో పంటను పరిశీలిస్తున్న ఏఓ తిమ్మప్ప

సాక్షిబృందం: సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారులు తెలియజేశారు. మడకశిర మండలం మండల పరిధిలోని గోవిందాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం కింద ఏఓ తిమ్మప్ప రాగి, కంది, మొక్కజొన్న, వేరుశనగ పంటను మంగళవారం పరిశీలించి పలు సూచనలు, సలహాలిచ్చారు. లేపాక్షి మండలంలోని కల్లూరు, నాయనిపల్లి పంచాయతీల్లో ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ ఆధ్వర్యంలో, అమరాపురం మండలంలోని బసవనపల్లి, ఆలదపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఏఓ మంజునాథ, పెనుకొండ మండలంలోని ఎర్రమంచితో పాటు పట్టణ పరిధిలో ఏడీఏ స్వయంప్రభ, అగళి మండలంలోని మండలలోని హెచ్‌డీ హళ్లి , బ్యాడగేరలో ఏఓ శేఖర్ నాయక్, గుడిబండ మండల పరిధిలోని శంకరగల్లు, రాళ్లపల్లిలోని రైతు సేవా కేంద్రంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

రొళ్ల: మండల పరిధిలోని గుడ్డగుర్కి గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నటరాజు, దిలీప్ తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే .. ఆవినకుంట గ్రామం నుంచి దిలీప్, లక్ష్మీదేవి ద్విచక్ర వాహనంలో గుడ్డగుర్కి వైపు వెళుతున్నారు. అదే సమయంలో గుడ్డగుర్కి వైపు నుంచి అగళి మండల కేంద్రానికి చెందిన నటరాజు ద్విచక్ర వాహనంలో వస్తూ ఢీ కొన్నారు. ఈ ఘటనలో దిలీప్, నటరాజు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే కర్ణాటక రాష్ట్రంలోని శిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

శారీరక శ్రమతో గుండె సమస్యలకు చెక్

పావగడ: శారీరక శ్రమతో గుండె రోగాలకు చెక్ పెట్టొచ్చని స్థానిక ప్రభుత్వాస్పత్రి టీహెచ్ఓ డా కిరణ్ తెలిపారు. మంగళవారం ఆస్పత్రి ఆవరణలో ఎన్‌సీడీ విభాగం ఆధ్వర్యంలో విశ్వ హృదయ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ గుండె జబ్బుల నివారణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి పాలనాధికారి బాబు, సిబ్బంది చంద్రకళ, ఎండీ ఖాసీం, ఓంకార్, గొల్లలప్ప, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.